నమస్తే తెలంగాణ

# ఉప్పల్ | మల్కాజిగిరి | మేడ్చల్

శనివారం 26 ఏప్రిల్ 2025

SATURDAY, APRIL 26, 2025

III

## 'ఆస్తిపన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందండి'

కాప్రా, ఏప్రిల్ 25: ఎర్లీ బర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు ఇంకా ఐదు రోజులే మిగిలి ఉందని, ఇంటి యజమానులు ఈనెల 30లోగా ఆస్తిపన్ను చెల్లించాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డీ. జగన్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ పథకానికి కాప్రా సర్కిల్‌లో మంచి స్పందన ఉందన్నారు. ఈ పథకం కింద కాప్రా సర్కిల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు రూ. 33.45 కోట్లు టార్గెట్ నిర్ణయించగా, ఈనెల 25 వరకు రూ. 20.21 కోట్ల ఆస్తి పన్ను చెల్లింపులు జరిగినట్టు తెలిపారు. రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేశవరం పంచాయతీని సందర్శించిన బీహార్ సర్పంచ్‌లు



శామీర్‌పేట, ఏప్రిల్ 25 : మండలంలోని కేశవరం గ్రామపంచాయతీకి ఎన్ఆర్ఐడీ నుంచి బీహార్ నుంచి 42 మంది సర్పంచ్‌లు శుక్రవారం విచ్చేశారు. గ్రామపంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులను, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ భవనం, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రం పీహెచ్‌సీ సబ్ సెంటర్, సీసీ రోడ్లు , అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చేపడుతున్న పనులు, ఆర్థిక వనరులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, జిల్లా పంచాయతీ అధికారి సాంబశివరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గీతారెడ్డి, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, ఎంపీవో మంగతాయారు, హౌసింగ్‌ఏఈ అల్లాజీ, పంచాయతీ కార్యదర్శి గౌతమి, స్వయం సహాయక మహిళలు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు వేలాదిగా తరలివెళ్దాం..

- బీఆర్‌ఎస్ నాయకుల పిలుపు
- వరంగల్ సభకు ఏర్పాట్లు ముమ్మరం

రామంతాపూర్, ఏప్రిల్ 25 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వేలాదిగా తరలి వెళ్దామని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. శుక్రవారం నాచారం డివిజన్లోని వివిధ కాలనీలలో సుమారు 32 జెండాలను ఆవిష్కరించేందుకుగాను ముందస్తుగా జెండా దిమ్మెలకు కార్పొరేటర్ రంగులు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివారం ఉదయమే ప్రతి కాలనీలో ముఖ్య నాయకుడు పార్టీ జెండా ఆవిష్కరించి బహిరంగ సభకు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్‌శేఖర్, ముత్యంరెడ్డి,విఠల్ యాదవ్, దాసరి కర్ణ, కెప్టెన్ కృష్ణ,లడ్డు, నరసింహ, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

### సభకు భారీగా తరలండి..

ఎల్కతుర్తిలో జరగబోయే రజతోత్సవ సభకు ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పిలునిచ్చారు. శుక్రవారం పిస్తాహౌస్ చౌరస్తాలో బీఆర్ఎస్ నూతన జెండా దిమ్మెను ఏర్పాటు చేస్తూ దిమ్మెకు గులాబీ రంగు వేశారు. అనంతరం బీఆర్ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి , కొకొండ జగన్, శ్రీనివాస్ యాదవ్, అశోక్‌చారి, శ్రీశైలం, శ్యామ్ బాలు, ప్రవీణ్, రవివర్మ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం..

వరంగల్‌లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని రామంతాపూర్ డివిజన్ యాదవ సంఘం భవన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ సన్నాహక సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. అంతకుముందు పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం రాష్ట్ర నాయకుడు పసుల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సర్వ బాబు యాదవ్ మాట్లాడుతూ.. వరంగల్ సభకు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు . కార్యక్రమంలో నాయకులు బోసాని పవన్ కుమార్, సతీశ్,ముస్తాక్, దయాకర్‌రెడ్డి, జహగీర్, కిట్టు, గణేశ్‌యాదవ్, చాంద్‌పాషా, సంపత్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్ : నాచారంలో బీఆర్ఎస్ గద్దెకు రంగు వేస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

### సభను విజయవంతం చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్ : బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్ అన్నారు. రాంపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

### చలో వరంగల్‌ను జయప్రదం చేయాలి

శామీర్‌పేట : ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవం సభకు భారీ ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు. 27న ఉదయం 10 గంటలకు అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్‌హాల్ నుంచి ర్యాలీగా బయల్దేరనున్నామన్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి, తూంకుంట బీఆర్ఎస్ శ్రేణులు సకాలంలో చేరుకోవాలన్నారు.



చిలుకానగర్‌లో పార్టీ గద్దెకు రంగు వేస్తున్న బీ.ప్రవీణ్‌ముదిరాజ్



రామంతాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వార్షిక పూజలు

- పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు



కీసర, ఏప్రిల్ 25: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి చీర్యాల్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శుక్రవారం రెండవ రోజు వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారికి పంచామృత నవ కళాశాభిషేకం, విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం, అఖండ జ్యోతిస్థాపన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, సుదర్శన నరసింహ యాగం వంటి పూజలు నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్, యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ప్రధాన అర్చకులు నర్సింహచార్యులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్‌తోపాటు మాజీ ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ప్రాంగణమందిరంలో సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కీసర మండల సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, జవహర్‌నగర్ మాజీ మేయర్ కావ్య,బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బెస్త వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

అదేవిధంగా స్వామివారిని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రామగుండం ఎమ్మెల్యే మటన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ సతీమణి మనాలి ఠాగూర్, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గోషామహల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సునీతారావు తదితరులు దర్శించుకున్నారు.




# పోలీసులు ప్రజలతో మమేకమవ్వాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు



జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ సుధీర్‌బాబు

జవహర్‌నగర్,ఏప్రిల్ 25: ఆధునిక కాలానికి దీటుగా పోలీసులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, కమ్యూనిటీ మీటింగ్‌లు పెడుతూ ప్రజలతో మమేకమవ్వాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పోలీసులకు సూచించారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గంజాయి, సైబర్ క్రైంపై యువతకు అవగాహన సదస్సులు పెట్టాలని, దొంగతనాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు సమస్యలను సత్వరమే పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ మహేశ్, జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సైదయ్య, ఇన్‌స్పెక్టర్లు ఇద్రీస్‌అలీ, రామునాయక్, నర్సయ్య, వేణుమాధవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనులు సామాజికంగా రాణించాలి

- గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

జవహర్‌నగర్, ఏప్రిల్ 25: గిరిజనులు ప్రకృతి ప్రేమికులని, సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయంగా జీవనం సాగించే గిరిజనులు సామాజికంగా రాణించాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి స్వరూప, శ్యామల లత ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో గిరిప్రసాద్‌నగర్‌కాలనీలోని సీపీఐ కార్యాలయంలో గిరిజన సమాఖ్య మహసభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా అంజయ్య నాయక్ పాల్గొని మాట్లాడుతూ.. గిరిజనులకు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సంఘటితమై గిరిజనులంతా ఉద్యమాలు చేయాలని అన్నారు. కిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న గిరిజనులపై అగ్రవర్ణాల అధికారులు వేధింపులు ఆపాలని పేర్కొన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా తెలంగాణ గిరిజన సమాఖ్య నూతన కౌన్సిల్ 21మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా శ్యామల లత, ప్రధాన కార్యదర్శిగా స్వరూపనాయక్, కార్యవర్గ సభ్యులను నియామితులయ్యారు. కార్యక్రమంలో సాయిలు గౌడ్, తోటపల్లి శంకర్, యాదగిరి, మహేశ్, జయమ్మ, సత్యం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్యనాయక్

## కీసరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కీసరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి

కీసర, ఏప్రిల్ 25 : రైతులు పండించిన పంటలు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మండల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కీసర మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేశ్‌యాదవ్, సీఈఓ కృష్ణారెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎన్ఎస్ కాలనీలో అక్రమ నిర్మాణం కూల్చివేత



బోడుప్పల్, ఏప్రిల్ 25: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఏ శైలజ హెచ్చరించారు. శుక్రవారం నగర పరిధిలోని ఆర్ఎన్ఎస్ కాలనీలో విజన్ పీజీ కళాశాల యాజమాన్యం చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని జేసీబీ సాయంతో తొలగించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి అక్రమ నిర్మాణంగా గుర్తించి తొలగించినట్లు ఆమె వెల్లడించారు. అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్టు స్పష్టంచేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.


## కుమ్మరుల వైకుంఠధామానికి మహర్దశ : కార్పొరేటర్



వైకుంఠధామంలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్, ఏప్రిల్ 25 : చిల్కానగర్ డివిజన్ కుమ్మరి కులస్తుల వైకుంఠధామం పనులు పూర్తి చేశామని, త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లో కుమ్మరి కులస్తుల వైకుంఠధామంలో జరుగుతున్న పనులను జీహెచ్ఎంసీ డీఈ వినీల్‌గౌడ్, ఏఈ రాధికతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. అన్ని పనులు పూర్తి చేశామని, త్వరలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వైకుంఠ దామాన్ని ప్రారంభిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణగౌడ్, బుద్ధం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, కుమ్మరి సంఘం నాయకులు గుమ్మడిల్లి మల్లేశ్, యాదయ్య, మహేశ్, పెంటయ్య, భాస్కర్, అశోక్, జంగయ్య పాల్గొన్నారు.

## యాదవుల సంక్షేమానికి కృషి చేస్తున్నాం..




చర్లపల్లి,ఏప్రిల్ 25: అఖిల భారత యాదవ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలుగా నిర్మాల యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కన్నెబొయిన జ్యోతి యాదవ్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి తెలిపారు. చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీలో అఖిల భారత యాదవ మహాసభ యాద్రాది భువనగిరి జిల్లా ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సత్యం యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆయోధ్యయాదవ్, వెంకటస్వామి యాదవ్, బాలరాజు యాదవ్, గిరి యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

జవహర్‌నగర్, ఏప్రిల్ 25: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి అంబేద్కర్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్‌లో ఎలుక ఉపేందర్‌రెడ్డి(23) తన తల్లి ఉమతోకలిసి నివసిస్తున్నాడు. ఉపేందర్‌రెడ్డి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల నూతన ఇంటి నిర్మాణానికి రూ. 18లక్షల మేర అప్పులు కాగా.. వాటికి మిత్తిలు కట్టలేక తీవ్రంగా మనోవేదనకు గురయ్యాడు. ఈనెల 24న రాత్రి ఉపేందర్‌రెడ్డి పురుగుల మందు తాగానని తల్లికి చెప్పాడు. వెంటనే అతడిని 108లో గాంధీ దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పుల బాధతోనే తమ కుమారుడు తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన యశ్వంత్(ఫైల్)

పోచారం, ఏప్రిల్ 25 : ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిల్ అయ్యానని మన స్తా పానికి గురైన విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ నారాయణ కళాశాలలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా హనుమాన్‌వాడకు చెందిన యశ్వంత్(17) అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఫలితాలు రావడంతో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన యశ్వంత్ ఇంటి నుంచి కళాశాలకు బయల్దేరి ఉప్పల్‌లో పురుగుల మందు కొనుగోలు చేసి గురువారం కళాశాలలో తా గాడు. గమనించిన కళాశాల సిబ్బంది ప్రైవేటు దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. పోచారం పోలీసులు గాంధీ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని కుంటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# అధికారులకే భూ సమస్యలు పరిష్కరించే అధికారం..





ఎదులాబాద్‌లో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఘట్‌కేసర్, ఏప్రిల్ 25: భూభారతి చట్టంలో భూసమస్యలు పరిష్కరించే అధికారం ప్రభుత్వం రెవెన్యూ అధికారులకే ఇచ్చిందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో కలెక్టర్ గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారన్నారు. ప్రతి గ్రామంలో తాసీల్దారు రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ధరణిలో పరిష్కారం కాని సమస్యలన్నీ భూభారతి ద్వారా పరిష్కారమవుతాయన్నారు. రైతులు కోరుకుంటే లైసెన్డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయన్నారు. ధరణి వల్ల పీఓబీ సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పీఓబీ రద్దు చేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు.

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సదస్సులో జడ్పీ మాజీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, ఘట్‌కేసర్ తాసీల్దార్ రజనీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీలు



ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఘట్‌కేసర్‌లోని జామియా మసీదు ముస్లింలు శుక్రవారం నమాజ్ అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గాం మృతులకు నివాళులర్పించారు మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం, పాషా, ఖుర్షిద్,అన్ను, రఫీ యుద్దీన్, షారుక్, జావీద్, అక్బర్, ఖలీల్, రెహమాన్ పాల్గొన్నారు.

### చర్లపల్లిలో..

చర్లపల్లి : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, మాజీ అధ్యక్షుడు నాథం, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### మృతులకు నివాళి

మేడ్చల్ కలెక్టరేట్ : పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి కలెక్టరేట్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అదేవిధంగా రాంపల్లి కేజీఆర్ కళాశాలలో సంతాప సభ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ పీవీ రమణారావు, ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


### ఈసీఐఎల్ వాకర్స్ ఆధ్వర్యంలో..

కాప్రా : పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఈసీఐఎల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మీనారాయణ, నరసింహ, బలరాం, వెంకటాచారి, చంద్రారెడ్డి,బాలాజీ, ప్రజలు పాల్గొన్నారు.

### పీర్జాదిగూడలో..

పీర్జాదిగూడ : పహల్గం ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం రాత్రి పీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దోమల నివారణకు కృషి చేయాలి




ఉప్పల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి

కాప్రా, ఏప్రిల్ 25 : కాప్రాలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో దోమల వ్యాప్తిని నిరోధించడానికి తీసుకోవలసిన చర్యలపై ఫోటోలు, దోమల జీవిత చరిత్రను తెలిపే చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమిషనర్ జగన్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం సర్కిల్ కార్యాలయం నుంచి కమలానగర్ మీదుగా ఈసీఐఎల్ వరకు ప్లకారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డీ.రమేశ్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, సర్కిల్ ఏఎంసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉప్పల్ పీహెచ్‌సీలో..

ఉప్పల్ : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.,. ప్రతి ఒక్కరూ మలేరియాపై అవగాహన కలిగి ఉండాలని, దోమలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్వీబీడీసీపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ..దోమలు పెరగకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనిన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో శోభారాణి, సత్యవతి, చంద్రకళ, గీత, మల్లేశ్వరి కౌశిక్, సౌశీల్య రాణి, ప్రకాశ్, మహేశ్‌గౌడ్, కరుణాదేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### దోమల నివారణలో అందరూ భాగస్వాములు కావాలి : ఏఈ

మల్కాజిగిరి : దోమల నివారణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఏఈ వనజ అన్నారు. శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా సఫిల్‌గూడ నుంచి ఆనంద్‌బాగ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ వనజ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియాను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గురుభూషణ్, నాగేందర్, షోకత్, రామచందర్, ఎండీ అబ్దుల్, సతీశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డైరీ ఆవిష్కరణ



విశ్రాంత ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

మల్లాపూర్, ఏప్రిల్ 25 : మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ రాజీవ్ పార్క్‌లో శుక్రవారం ఈసీఐఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. కార్పొరేటర్ ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిటైర్డ్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ప్రతాపరెడ్డి మల్లేశ్‌గౌడ్, వీరభద్రరావు, రామ శర్మ, చైర్మన్ షేక్‌లాల్, వైస్ చైర్మన్ నర్సింగరావు, కోఆర్డినేటర్ చిట్టిబాబు, కన్వీనర్ బేతి పాండు, కోశాధికారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి చక్ర పురస్కారాలు

మేడ్చల్, ఏప్రిల్ 25: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం విధుల్లో ఉత్తమంగా వ్యవహరించి, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన ఉద్యోగులు, కార్మికులకు ప్రగతి చక్ర పురస్కారాలను అందజేశారు. అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను నిర్వహించిన మెకానిక్‌లు, కార్మికులను డిపో మేనేజర్ సుధాకర్ సత్కరించి, ప్రశంసా ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజనీరు స్నేహలత, సూపరింటెండెంట్ పీఎస్ఎన్, రావు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



అదృశ్యమైన కల్పన (ఫైల్)

పీర్జాదిగూడ ఏప్రిల్ 25: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఘట్కేసర్ మండలం కాచావాణి సింగారం గ్రామంలో నివాసం ఉంటున్న కల్పన(29) ఇంట్లోనే ఉంటున్నది. ఈనెల 23న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు.